క్లుప్తంగా

అభినయశ్రీకి గోల్డ్ మెడల్స్



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన గరిగే అభినయశ్రీ ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓపెన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబర్చి రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. 200, 100 మీటర్ల రన్నింగ్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచింది. అభినయశ్రీ ప్రస్తుతం కీసరగుట్టలోని వర్తని పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్



కమలాపూర్ : నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవం సందర్భంగా కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌కు చెందిన దేవ శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బుధవారం అర్థశాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ కొండా రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో శ్రీనివాస్ 'వర్కింగ్ ఆఫ్ ప్రైమ్ మినిస్టర్స్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం ఇన్ కరీంనగర్ డిస్ట్రిక్ట్–యాన్ అనాలిటికల్ స్టడీ' అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించినందుకు శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రధానం చేశారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు, మిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రెండు మోటార్ల చోరీ

ఆత్మకూరు : పొలం వద్ద ఏర్పాటు చేసిన కరెంట్ మోటార్లను దొంగలు అపహరించిన సంఘటన మండలంలోని హౌజుబుజుర్గు బుధవారం చోటుచేసుకుంది. సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన సయ్యద్ వలీ, పెండల సారయ్య కటాక్షపూర్ చెరువు కట్ట కిందఉన్న పొలాల వద్ద కరెంటు మోటర్లు ఏర్పాటు చేసుకుని పంట సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సయ్యద్ వలీకి చెందిన 5 హెచ్‌పీ కరెంట్ మోటార్, పెండల సారయ్యకు చెందిన 3 హెచ్‌పీ మోటార్‌ను అపహరించినట్లు బాధితులు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభానికి పల్లె దవాఖానా సిద్ధం

దామెర : గ్రామీణ ప్రాంతల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మండలంలోని ఊరుగొండలో నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా 16 లక్షల వ్యయంతో ఇటీవల పల్లె దవాఖానా (సబ్ హెల్త్ సెంటర్) నిర్మించారు. త్వరలో ప్రారంభించేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. కాగా బుధవారం నూతన భవన పరిసర ప్రాంతాలను సిబ్బంది చదును చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కల్పన పరిశీలించి మాట్లాడారు. పల్లె దవాఖానను త్వరలో గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట ఏపీఓ శారద, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఏఎన్‌ఎం పద్మ ఉన్నారు.

గుడుంబా పట్టివేత

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో 20 లీటర్ల గుడుంబాను పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను గమనించిన వ్యక్తి పారిపోతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా 20 లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు తెలిపారు. అతడిని విచారించగా గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన అజ్మీరా రామ్‌సింగ్ అని తెలిపినట్లు పేర్కొన్నారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని రామ్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ



శాయంపేట : మండల కేంద్రంలోని దేవుని చెరువు కట్ట కిందఉన్న మంచినీటి బావి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నీటిని సరఫరా చేసే పైపులైన్ లీకేజీ అయ్యింది. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'భూ భారతి'తో వారసత్వ పట్టాలు జారీ

సంగెం : తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి ద్వారా రైతులకు వారసత్వ (విరాసత్) పట్టాలు జారీ చేస్తున్నట్లు తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు వారసత్వ పట్టాలు చేసి లబ్ధిదారులకు అందజేశారు. కాగా గత నెలలో రెవెన్యూ సదస్సుల్లో రైతులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

ఓఆర్ఆర్‌పై కానరాని సెంట్రల్ లైటింగ్



లైట్లు లేకపోవడంతో చీకట్లో వెళ్తున్న వాహనదారులు



సర్వీస్ రోడ్డులో వెలగని లైట్లు

- కమ్ముకున్న చీకటి
- జంకుతున్న వాహనదారులు
- రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటులో నిర్లక్ష్యం
- దృష్టిసారించని సంబంధిత అధికారులు

ధర్మసాగర్ : కొన్నేళ్ల క్రితం నిర్మించిన జాతీయ రహదారి (ఓఆర్ఆర్)పై సెంట్రల్ లైటింగ్‌కు మోక్షం లభించకపోవడంతో కారుచీకటి కమ్ముకుంది. ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. 15 ఏళ్ల క్రితం కరుణాపురం శివారు నుంచి రాంపుర్, ఎల్కుర్తి, ధర్మసాగర్, టేకులగూడెం, ఉనికిచర్ల, దేవన్నపేట తదితర గ్రామాల మీదుగా భూపాలపట్నం వరకు నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మించారు. అక్కడక్కడా సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు. కానీ ఇతర చోట లైట్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడం మరిచారు. కాజీపేట మండలంలోని టేకులగూడెంతో పాటు ధర్మసాగర్ మండలంలోని, పెద్దపెండ్యాల, ఎల్కుర్తి గ్రామాలకు వెళ్లే రహదారి వద్ద సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కాజీపేట నుంచి టేకులగూడెం, మడికొండ నుంచి ఎల్కుర్తి, రాంపూర్ నుంచి పెద్ద పెండ్యాల గ్రామాలకు వెళ్లేవారు జాతీయ రహదారి మీదుగా క్రాస్ చేసి వెళ్లాల్సి ఉంటుంది. అయితే జాతీయ రహదారిపై లైట్లు లేకపోవడంతో పాటు తోడు రంబుల్ స్ట్రిప్స్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో (ఓఆర్ఆర్) జాతీయ రహదారి గుండా వెళ్లే వాహనాలు అతి వేగంగా దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా ధర్మసాగర్ బ్రిడ్జి వద్ద నిర్మించిన సర్వీస్ రోడ్డులో రంబుల్ స్ట్రిప్స్ నిర్మించకపోవడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. బ్రిడ్జిపైన అమర్చిన లైట్లు వెలుగకపోవడంతో సర్వీస్ రోడ్డు గుండా, బ్రిడ్జి కింద నుంచి వెళ్లే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఉనికిచర్ల బ్రిడ్జి పక్కన నిర్మించిన సర్వీస్ రోడ్డుగుండా ఓ ప్రయాణికుడు ద్విచక్ర వాహనంతో వస్తున్న క్రమంలో బ్రిడ్జి కింద నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టగా ప్రమాదం సంభవించింది. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్ స్పందించి బ్రిడ్జికిరువైపులా సర్వీస్ రోడ్డులో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా గ్రామాల పరిధిలో జాతీయ రహదారిపై, బ్రిడ్జికిరువైపులా నిర్మించిన సర్వీస్ రోడ్డులో రంబుల్ స్ట్రిప్స్‌తో పాటు లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హైవేపై లైటింగ్ ఏర్పాటు చేయాలి



ధర్మసాగర్, ఉనికిచర్ల బ్రిడ్జిలు, ఎల్కుర్తి క్రాస్ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారికి సంబంధించిన గుత్తేదారు, ఉన్నతాధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్‌తో పాటు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలి.

– వెంకట్‌రెడ్డి, ధర్మసాగర్

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



విద్యార్థికి దుస్తులు, నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్లో బుధవారం విద్యార్థి నాయకుల నియామకం జరిగింది. అలాగే పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థి తోగరు మణికంఠకు సొసైటీ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ దుస్తులు, నోట్ బుక్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ జాయిస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- డీఈఓ వాసంతి



జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ వాసంతి

పరకాల : ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి సూచించారు. మండలంలోని కామారెడ్డిపల్లి, పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండీఎం రిజిస్టర్, విద్యార్థుల డైరీ, హాజరు పట్టికతో పాటు తరగతి గదులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు నమోదును పెంచాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని సూచించారు. చెడు మార్గాల వైపు వెళ్లొద్దని అన్నారు. ఆమె వెంట జిల్లా సెక్టోరియల్ అధికారి మన్మోహన్, మండల విద్యాశాఖ అధికారి రమాదేవి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ఎంఈఓ భిక్షపతి

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని 10వ తరగతి వార్షిక పరీక్షల్లో మండలస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 15 మంది విద్యార్థులకు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్‌వారు పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ట్రస్ట్ నిర్వాహకుడు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శేఖర్ అధ్యక్షతన పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా ఎంఈఓ భిక్షపతి పాల్గొని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులు సాధించడం భవిష్యత్‌లో తొలిమెట్టు అన్నారు. రిటైర్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్‌బాబు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వడం లేదని..

- మనస్తాపంతో గడ్డిమందు తాగిన మహిళ



గడ్డిమందు తాగిన యాదమ్మ

ఎల్కతుర్తి : అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని మనస్తాపానికి గురైన ఓ మహిళ గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కనూరుకు చెందిన గుడికందుల రమేశ్‌కు హసన్‌పర్తి మండలం దేవన్నపేటకు చెందిన పొల్లెపల్లి చంద్రశేఖర్ రూ.24 లక్షలు అప్పుగా ఇచ్చాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా రమేశ్ పలుమార్లు వాయిదాలు వేశాడు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో పంచాయితీలు పెట్టినప్పటికీ ఫలితం లేదు. దీంతో బాధిత కుటుంబం ముల్కనూరు పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా ఈనెల 5న డబ్బులు చెల్లించేందుకు రమేశ్ ఒప్పుకున్నాడు. కానీ డబ్బులు చెల్లించలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన చంద్రశేఖర్ తల్లి యాదమ్మ అప్పు తీసుకున్న రమేశ్ ఇంటి ఎదుట గడ్డిమందు తాగింది. వెంటనే యాదమ్మను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

ఎంజేపీని సందర్శించిన అగ్నిమాపక సిబ్బంది



ఎంజేపీ పాఠశాలను పరిశీలిస్తున్న పరకాల అగ్నిమాపక అధికారి భద్రయ్య

శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల సిబ్బంది పరకాలలోని అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ సేఫ్టీ కోసం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ)కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం పరకాల అగ్నిమాపక అధికారి భద్రయ్య, సిబ్బంది ఎంజేపీ గురుకుల పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ఎంజేపీ గురుకుల పాఠశాల రోడ్డు, వంటశాల, తరగతి గదులు, చుట్టూ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ విషయమై పాఠశాల ఉపాధ్యాయుడు సుభాష్‌చంద్ర మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలను సైనిక్ స్కూల్‌గా ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాల్సిన ఉందన్నారు. అందులో భాగంగా అగ్నిమాపక కేంద్రం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) అవసరం ఉందన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

- మెడికల్ ఆఫీసర్ మహేంద్రకుమార్



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

దామెర : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేంద్రకుమార్ అన్నారు. మండలంలోని పసరగొండలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల కారణంగా వచ్చే వ్యాధులపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఇంటి పరిసర ప్రాంతల్లో నీరు నిలిచినచోట దోమలు వ్యాప్తిచెంది మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, డెంగీ వంటి వ్యాధులు సోకుతాయని అన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సూపర్‌వైజర్ శ్రీకాంత్, కళాకారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ



కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో స్వచ్ఛ భారత్ మిషన్ నిధులు రూ.3 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎంపీడీఓ గుండె బాబు బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామ ప్రత్యేకాధికారి ప్లవన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏపీఓ రమేశ్, ఏంపీఎం నారాయణ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, ఉప్పల్ గ్రామైక్య సంఘాల అధ్యక్షులు మమత, సలీమా, వీఓఏలు లావణ్య, అపర్ణ, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పైండ్ల రాజయ్య బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాజయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజయ్య అంతమయాత్రలో పాల్గొన్నారు. నాయకులు మోహన్, కరణ్ బాబు, రమేశ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కమలాపూర్ : మాట్లాడుతున్న సైకాలజిస్ట్ శ్రీనివాస్ అడ్డిగ



ఎల్కతుర్తి : అవగాహన కల్పిస్తున్న ప్రహసిత్

కమలాపూర్ : జీవితంలో సమయం చాలా విలువైందని విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీనివాస్ అడ్డిగ సూచించారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కాలేజీలో '21వ శతాబ్దపు నైపుణ్యాలు' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో టైం మేనేజ్‌మెంట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, పాజిటివ్, నెగెటివ్ దృక్పథాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేస్తున్నారని, సమయం విలువను గుర్తించి నడుచుకోవాలన్నారు. విద్యార్థులు పాజిటివ్ దృక్పథం అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో కూడిన విద్యార్థి జీవితం భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా ఎదగడానికి తోడ్పడుతుందన్నారు. విద్యార్థులు ఆస్క్ (అడగడం), లిసెన్ (వినడం), ఫాలో (అనుసరించడం) అనే పద్ధతుల ద్వారా విషయాలను అవగతం చేసుకోవాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమైందని అన్నారు. ఒత్తిళ్లను సమర్థవంతంగా అధిగమించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా అనుకున్న లక్ష్యం ఛేదించాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ సూచించారు. బుధవారం భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. జ్ఞాపకశక్తి లోపం, పరీక్షల భయం, ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం, లైఫ్ స్కిల్స్, గోల్ సెట్టింగ్ తదితర అంశాలపై వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

- ఈఓ నాగేశ్వర్‌రావు



మొక్క నాటుతున్న ఈఓ నాగేశ్వర్‌రావు

ఐనవోలు : ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఈఓ నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఆయన మొక్క నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఆలయంలో నీడనిచ్చే మొక్కలు నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చకులు నందనం భాను ప్రసాద్, పాతర్లపాటి నరేష్, ఉప్పుల శ్రీనివాస్, సిబ్బంది కిరణ్ కుమార్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ



షూ పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

వేలేరు : మండలంలోని పీచర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో 1997–98, 2011–12 సంవత్సరాల నడుమ చదివిన పూర్వ విద్యార్థులు సాయం అందించారు. సుమారు రూ.25 వేల విలువచేసే షూ అందించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని అన్నారు. పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. హెచ్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

'చిరువ్యాపారులకు గదులు కేటాయించాలి'

పరకాల : రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోతున్న చిరువ్యాపారులకు తక్షణమే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వెనుక కాంప్లెక్స్ నిర్మాణం పూర్తిచేసి గదులు కేటాయించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ డిమాండ్ చేశారు. బుధవారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యలపై మున్సిపల్ కమిషనర్ సుష్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ.. వారం రోజులుగా కాలనీలకు స్వచ్ఛవాహనాలు రాకపోవడంతో పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున బ్లీచింగ్ ఫౌడర్ చల్లాలని కోరారు. పాత పోస్టుమార్టమ్ దారిలో పశువుల వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజభద్రయ్య, మాజీ కౌన్సిలర్ భద్రయ్య, పట్టణ నాయకులు తిరుపతి, పురుషోత్తం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్పన

దామెర : గ్రామాల్లో అభివృద్ధి పనులపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కల్పన అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారిగా జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా నర్సరీల్లో ఉన్న మొక్కలను నాటే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై దృష్టిసారించి అంతర్గత రహదారులపై నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు సైతం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, ఈసీ రాజేశ్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి యువకుడి మృతి

- ఈ ఘటనలో ఆరుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ

ఎల్కతుర్తి: అడవి పందులను వేటడానికి విద్యుత్ వైర్ అమర్చగా, ఆ తీగ తాకి ఓ యువకుడి మృతి చెందిన ఘటనలో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎల్కతుర్తి సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌కు చెందిన గండికోట సాంబరాజు (32) తన స్నేహితులు శీలం బాలరాజు, ఊదరి రాజుతో కలిసి ఈనెల 12న పావురాల వేటకు గ్రామశివారులోని పచ్చునూరి ప్రవీణ్ పొలం వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అప్పటికే అక్కడ అడవి పందుల వేట కోసం గోపాల్‌పూర్‌కు చెందిన తక్కళ్లపల్లి చందర్‌రావు అనే వ్యక్తి సూచనతో అదే గ్రామానికి చెందిన పెండ్యాల తిరుపతి, ఎల్కతుర్తికి చెందిన బొజ్జ స్వామి, బొజ్జ సతీశ్.. పచ్చునూరి ప్రవీణ్ పొలం నుంచి తక్కళ్లపల్లి నర్సింగారావు పొలం వరకు విద్యుత్ వైరు అమర్చారు. దీనిని గమనించని సాంబరాజు విద్యుత్ తీగకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో సాంబరాజు వెంట ఉన్న బాలరాజు, ఊదరి రాజు భయంతో పారిపోయారు. తెల్లవారుజామున విద్యుత్ వైరు అమర్చిన పెండ్యాల తిరుపతి, బొజ్జ స్వామి, బొజ్జ సతీశ్ వచ్చి చూడగా సాంబరాజు చనిపోయి కనిపించాడు. దీంతో నేరం తమపైకి రాకుండా మృతదేహాన్ని గోపాల్‌పూర్‌కు చెందిన మాసిపెద్ది భాస్కర్‌రావు వ్యవసాయ బావిలో పడేశారు. పావురాల వేట కోసం వెళ్లి బావిలో పడి మృతి చెందినట్లు చిత్రీకరించి కేసు తప్పుదోవ పట్టించే యత్నం చేశారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. గోపాల్‌పూర్ క్రాస్ వద్ద ఆరుగురు నిందితులు పెండ్యాల తిరుపతి, తక్కళ్లపల్లి చందర్‌రావు, బొజ్జ స్వామి, బొజ్జ సతీశ్, శీల బాలరాజు, ఊదరి రాజును అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ పులి రమేశ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది మల్లేశం, విఠల్‌రావు, బుచ్చిలింగం, భాస్కరెడ్డి, బక్క య్య, రాజయ్య, సుమన్ రంజిత్, సదానందంను అభినందించారు.